క్లుప్తంగా

దాతల ఆశయాలను విద్యార్థులు నెరవేర్చాలి



దాత అందించిన ఆర్థిక సాయాన్ని విద్యార్థినికి అందజేస్తున్న కళాశాల సిబ్బంది

కాజులూరు: దాతల ఆశయాలను విద్యార్థులు నెరవేర్చే దిశగా కృషి చేయాలని కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ ఎస్ శ్రీనివాస్ అన్నారు. గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్య నభ్యసిస్తూ ప్రతిభ కనబరుస్తున్న పలువురు పేద విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన దువ్వూరి శ్రీరామ భాస్కర సత్యసాయి ఉపకారవేతనాలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా కాజులూరు ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న కట్టా శిరీష ప్రతిభను గుర్తించి రూ.ఐదు వేల ఆర్థిక సాయం ఆన్‌లైన్‌లో అందజేశారు. గురువారం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు విద్యార్థినికి నగదు సాయాన్ని అందజేశారు.

నేటి నుంచి విజయదుర్గ జాతర



అంగరలోని విజయ దుర్గ అమ్మవారు

కపిలేశ్వరపురం: అంగరలోని విజయదుర్గ అమ్మవారి జాతర శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ఆలయ నిర్వహణ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ పురోహితులు కొలువుల మల్లికార్జునరావు మాట్లాడుతూ శుక్రవారం ఆలయం వద్ద జాతర, 22న తీర్థం, 23న నైవేద్య సమర్పణ నిర్వహించనున్నట్టు తెలిపారు.

అబ్బుర పరిచిన అక్షరమాల



చిన్నారులు తీర్చిదిద్దిన అక్షరమాల

మండపేట: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పరస్కరించుకొని 30వ వార్డు సంగం కాలనీ ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడు చిట్టూరి వెంకట శ్రీధర్ ఆధ్వర్యంలో విద్యార్థులు మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం పాఠశాలలోని చిన్నారులతో తెలుగు అక్షరాలు వేయించారు. గింజలు, బాటిల్ మూతలతో అక్షరమాలను అందంగా తీర్చిదిద్దారు. చిన్నారులు తీర్చిదిద్దిన రంగు రంగుల అక్షరాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

గ్రామాల్లో ఆధార్ శిబిరాలు

కపిలేశ్వరపురం: ఆధార్ వివరాలను నవీకరించడంతో పాటు నూతన ఆధార్ నమోదు కోసం మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ప్రత్యేక నవీకరణ కేంద్రాలను నిర్వహించారు. ఎంపీడీఓ రత్నకుమారి పర్యవేక్షణలో అంగర, కాలేరు, కోరుమిల్లి గ్రామాల సచివాలయాల పరిధిలో చిన్నారుల ఆధార్ వివరాలను నవీకరించారు. ఆయా శిబిరాల్లో డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీర మల్లేశ్వరరావు, కోరా దొరబాబు, ఫణీంద్ర సేవలందించారు. శుక్రవారం సైతం అవే గ్రామాల్లో శిబిరాలను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రత్నకుమారి తెలిపారు.

డిగ్రీ కళాశాలలో వన మహోత్సవం



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మండపేట: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహద పడతాయని మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్ అన్నారు. కళాశాల ఆవరణలో గురువారం వన మహోత్సవం నిర్వహించారు. అనపర్తి ప్రథమ్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ సౌజన్యంతో కళాశాల ఆవరణలో నర్సింగ్ టీచర్ పి శిరీష, నర్సింగ్ విద్యార్థులు అరటి మొక్కలు నాటారు. అధ్యాపకులు చాపల అభినయ్, రామకృష్ణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రాయవరం: సోమేశ్వరంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రాయవరం మండలం సోమేశ్వరంలో పేకాడుతున్న అనసూరి ప్రసాద్, మిరియాల సత్యనారాయణ, గుర్రపు వీరరాఘవులు, గండు సాంబమూర్తి, దంగేటి విష్ణులను పట్టుకొని వారి వద్ద నుంచి రూ.5,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు.

బాబోయ్.. దూసుకొస్తున్నాయ్..!

- ఇసుక లారీల స్పీడుకు బెంబేలెత్తుతున్న జనం
- ఆందోళనకు గురవుతున్న వాహన చోదకులు
- తరచూ ఏదో ఒకచోట ప్రమాదాలు
- పలువురి మృత్యువాత
- పట్టించుకోని అధికారులు

కె.గంగవరం: ఇసుక లారీలు మృత్యు శకటాలుగా మారుతున్నాయి. మితిమీరిన వేగంతో దూసుకొస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇప్పటికే వీటి కారణంగా పలువురు మృత్యువాత పడగా మరికొందరు క్షతగాత్రులుగా మారారు. కనీసం గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలోనూ వీటి వేగం తగ్గటం లేదు. దీంతో స్థానిక ప్రజానీకం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భయం నీడలో కాలం వెళ్లదీస్తున్నారు. మరోవైపు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. అధికారుల ఉదాసీనత కారణంగా ఇసుల లారీల స్పీడుకు బ్రేకులు పడడం లేదు. కోరుమిల్లి, కపిలేశ్వరపురం తదితర ఇసుక ర్యాంపుల నుంచి రోజూ పదుల సంఖ్యలో లారీలు మండలం మీదుగా పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుకను పలు ప్రాంతాలకు తరలిస్తుయి. కపిలేశ్వరపురం మండలంలోని ఇసుక ర్యాంపుల నుంచి ఇసుకను నేరుగా ఏటిగట్టుపై కూళ్ల, పామర్రు మీదుగా కె.గంగవరం, ద్రాక్షారామ తలిస్తున్నారు. ఈ లారీల స్పీడుకు ద్విచక్ర వాహనదారులు రహదారుల పక్కన ఆగిపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనికి తోడు రహదారికి ఇరువులా అప్రోచ్‌లు లేకపోవడంతో ప్రయాణికులు మరింత ఇబ్బందులు పడుతున్నారు.

బ్రేకులు వేయాల్సిందే

గతంలో కోటిపల్లిలో ఓ బాలుడు ఇసుకలారీ కింద పడి మృతి చెందాడు. కె.గంగవరంలో ఇసుక లారీ స్పీడుగా వచ్చి ఓ హోటల్‌లోకి దూసుకుపోవడంతో భారీ ఆస్తినష్టం వాటిల్లింది. గత నెలలో పామర్రు గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు కూళ్ల వంతెన వద్ద మోటారు సైకిల్‌పై వెళుతుండగా ఇసుక లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై ఆసుపత్రి పాలయ్యారు. అముజూరు ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఇంట్లోకి ఇసుక లారీ దూసుకుపోయింది. దీంతో పాటు నిత్యం ఏదో చోట ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక లారీల స్పీడుకు బ్రేకులు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

యథేచ్ఛగా ఇసుక తరలింపు

ప్రతిరోజూ ఇసుకను లారీలు, ట్రాక్టర్ల సహాయంతో భారీగా తరలిస్తున్నారు. కపిలేశ్వపురం, జోన్నాడ తదితర ర్యాంపుల నుంచి నిత్యం మూడు వందలకు పైగా లారీలతో ఇసుకను తరలించి రాత్రికి రాత్రే నిల్వ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో పాటు నియోజకవర్గంలోని రామచంద్రపురం, ద్రాక్షారామ, కాజులూరు తదితర ప్రాంతాల్లో ఇసుకను భారీగా నిల్వ చేస్తున్నట్లు పలువురు చెబుతున్నారు.



కూళ్ల ఏటిగట్టుపై ఇసుక లారీని అడ్డుకున్న గ్రామస్తులు(ఫైల్)

అధికారులు స్పందించాలి



ఏటిగట్టుపై ప్రయాణిస్తున్న ఇసుక లారీలు భయందోళనకు గురి చేస్తున్నాయి. పరిమితికి మించి ఇసుక లోడుతో అధిక వేగంగా గ్రామీణ రోడ్లపై ప్రయాణిస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

పెంకే రవిచంద్ర, పామర్రు.

భయమేస్తోంది..



ఇసుక లోడుతో వెళుతున్న లారీలు కనీసం గ్రామాల్లో కూడా స్పీడు తగ్గించటం లేదు. రోడ్డుపై జన సంచారం ఉన్నా పట్టించుకోకుండా డ్రైవర్లు మరింత స్పీడుగా నడుపుడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుందోనని ఆందోళనగా ఉంది.

అడపా నారాయణస్వామి, సుందరపల్లి.

దోమల నియంత్రణకు చర్యలేవీ?

- సమాచారం లేకుండానే కమిషనర్ వార్డు పర్యటన
- కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ నిలదీత
- సాదాసీదాగా కౌన్సిల్ అత్యవసర సమావేశం



సమావేశానికి హాజరైన సభ్యులు

మండపేట: పట్టణంలో దోమలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలు నానా బాధలు పడుతున్నారని మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ అన్నారు. చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం గురువారం జరిగింది. ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఎమ్మెల్యే, అంచనా కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు హాజరయ్యారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రెండు అంశాలతో సమావేశం ముగించారు. రాధాకృష్ణ మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా మండపేట పట్టణంలో దోమలు ఎక్కువయ్యాయన్నారు. కమిషనర్ తనకు తానుగా వార్డుల్లో పర్యటనలు చేస్తున్నారని కౌన్సిలర్లకు కనీస సమాచారం చేరవేయడం లేదని అసహనం వ్యక్తం చేశారు. 3వ వార్డు కౌన్సిలర్ గంగరాజు మాట్లాడుతూ మండపేట బస్టాండులో మరుగుదొడ్ల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో కమిషనర్ టీవీ రంగారావు, డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కాజులూరు: వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొల్లపాలెం పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సామియేలు అన్నారు. జాతీయ క్షయవ్యాధి వ్యతిరేక వారోత్సవాలలో భాగంగా తర్లపూడి మండల పరిషత్ పాఠశాలలో టీబీ సూపర్‌వైజర్ హనుమంతరావు ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు, స్థానికులకు క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సులువుగా సంక్రమిస్తుందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గటం, కళ్లెలో రక్తం రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలన్నారు. మందులు సక్రమంగా వాడుతూ అవగాహన పెంచుకుంటే ఈ వ్యాధిని సమర్థవంతంగా నిర్మూలించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రశాంత్, ఎంపీహెచ్‌ఓ సూర్యప్రకాశ్, ఎంపీహెచ్‌ఎం వరలక్ష్మి, పీహెచ్‌సీ సిబ్బంది ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



ప్రసన్నాంజనేయస్వామి రథోత్సవం



స్వామిని దర్శించుకున్న సూర్యప్రకాశ్, నాయకులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెం శివారు దాసరపాడులో వేంచేసి యున్న ప్రసన్నాంజనేయస్వామి ఆలయ 34వ వార్షికోత్సవం గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు యల్లమిల్లి సతీష్‌కుమారి, రవి దంపతుల నేతృత్వంలో స్వామివారి రథోత్సవం నిర్వహించారు. స్వామివారితో పాటు ఆలయాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నప్రసాద వితరణ చేశారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, ఏపీ ఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అప్పారావు తనయుడు పిల్లి శ్రీనివాస రామారావు, మాజీ సర్పంచ్‌లు పిల్లి రాంబాబు, కొప్పిశెట్టి శ్రీలక్ష్మి గ్రామ పెద్దలు అనుసూరి వెంకట రమణ, అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

సమష్టి కృషితో ప్రగతి సాధిద్దాం



డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ రంగారావు

మున్సిపల్ కమిషనర్ రంగారావు

మండపేట: సమష్టి కృషితో మండపేటను ఆరోగ్యవంతమైన పట్టణంగా తీర్చిదిద్దుదామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ మండపేట కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆయన గురువారం డ్వాక్రా మహిళలతో మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా ఆర్పీలకు అవగాహన కల్పించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించేలా వార్డులో ప్రతి ఇంటికీ వెళ్లాలన్నారు. ఇంటింటా తిరిగి మహిళలకు శుభ్రత కోసం వివరించాలన్నారు. డీఈ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత, సీవోలు, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తి అలవర్చేందుకు స్కౌట్స్ అవసరం



అయినవిల్లిలో పాల్గొన్న స్కౌట్ విద్యార్థులు

అయినవిల్లి: విద్యార్థుల్లో క్రమశిక్షణతో కూడిన దేశభక్తి అలవరచేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ అవసరమని ఎంఈఓ పి.శ్రీనివాస్ అన్నారు. గురువారం ముక్తేశ్వరం జయంతి రామయ్య పంతులు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల స్కౌట్ అండ్ గైడ్స్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షతన ఏఈఓ పి.శ్రీనివాస్ ప్రారంభించారు. అండ్ గైడ్స్ సీనియర్ ఉపాధ్యాయులు, రిటైర్డ్ మండల విద్యాశాఖ అధికారి జొన్నలగడ్డ గోపాలకృష్ణ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ సభ్యులకు 32 మందికి క్యాపు ధరింపజేశారు. ఎంఈఓ పి.శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు గణేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవా భావం, దేశభక్తి అలవరుచుకుని దేశ సమగ్రతకు మంచి భావిభారత పౌరులుగా ఎదగాలని కోరారు. అనంతరం సీనియర్ స్కౌట్ ఉపాధ్యాయులు జొన్నలగడ్డ గోపాలకృష్ణ దుస్సాలువతో ఘనంగా సన్మానించారు. స్కౌట్ ఉపాధ్యాయులు డి.సత్యనారాయణ, బీబీవీ కుమారి, షేక్ అమెజాని తదితరులు ఉన్నారు.

సమాజ సేవకులుగా పేరు తెచ్చుకోవాలి

అంబాజీపేట: దేశభక్తిని క్రమశిక్షణను పెంపొందించుకుని సమాజ సేవకులుగా పేరు తెచ్చుకోవాలని ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం కడలి సాయిరాం అధ్యక్షతన సీనియర్ స్కౌట్, గైడ్స్ సలహాదారుడు జేవీఎస్ కె.గోపాలకృష్ణ నేతృత్వంలో స్కౌట్ అండ్ గైడ్స్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హైస్కూల్ నుంచి ఎంపికైన 16 మంది బాలికలు, 16 మంది బాలురు, శిక్షణ పొందిన స్కౌట్ టీచర్లు ఎల్.వెంకటేశ్వరరావు, టి.రమాకుమారిలచే స్కౌట్ అండ్ గైడ్ నియమ నిబంధనలచే ప్రమాణం చేయించారు. విద్యార్థినులు చేయి విధులపై వివరించారు. అనంతరం స్కౌట్ విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, వైస్ చైర్మన్ బండారు అమ్మాజీ, స్టాఫ్ సెక్రటరీ వెన్నపు సత్యనారాయణ, ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వరరావు, బీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

వైభవంగా తిరుప్పావడ సేవ



చింతలూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న తిరుప్పావడ సేవలో పాల్గొన్న భక్తులు

ఆలమూరు: చింతలూరులో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహించిన తిరుప్పావడ సేవ భక్తులను అమితంగా ఆకట్టుకుంది. ద్వితీయ వార్షిక పాంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన గురువారం నాడు వైష్ణవాలయాల్లో అత్యంత ప్రముఖంగా జరిపే తిరుప్పావడ (అన్న కూటోత్సవం) సేవను వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ కమిటీ ఘనంగా నిర్వహించింది. ద్వాపర యుగంలో శ్రీకృష్ణ పరమాత్మ గోవర్ధన పర్వతాన్ని ఎత్తి గోకుల వాసులందరినీ ప్రకృతి వైపరీత్యం నుంచి రక్షించి, వారందరికీ ఆకలి బాధలు లేకుండా పోషించిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ వైష్ణవాలయాల్లో ఈ తిరుప్పావడ సేవ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సేవలో భాగంగా సుమారు 200 కేజీల పులిహోరను స్వామి వారి ఎదురుగా రాశిగా పోసి, నివేదన చేసిన అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. తిరుప్పావడ సేవను దర్శించడానికి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చారు.

కన్నుల పండుగగా హనుమద్ వాహన సేవ

ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు హనుమద్ వాహనంపై ఆశీనులై స్వామివారు శ్రీరాముని అవతారంలో భక్తులకు అభయమిచ్చారు. హనుమద్ వాహనంపై స్వామి వారు విహరిస్తుంటే భక్తులు తిలకించారు. భక్తులకు భారీ అన్నసమారాధన జరిగింది.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

కొత్తపేట: ఒక కుటుంబాన్ని మభ్యపెట్టి బంగారం వస్తువులు దొంగిలించుకుపోయిన ఒక వ్యక్తిని అరెస్టు చేసి, ఆ వస్తువుల స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై జీ సురేంద్ర తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 14వ తేదీన మధ్యాహ్నం సమయంలో ఓ వ్యక్తి స్థానిక పనసలదొడ్డి గ్రామంలో గుబ్బల వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఇంటికి వెళ్లి, నేను సచివాలయం నుంచి వచ్చాను. మీకు పీఎంవై పథకం కింద లోన్ వస్తుందని చెప్పి, ఆధార్ కార్డు ఇమ్మని అడిగి తీసుకున్నాడు. ఈ రోజు లాస్ట్ రోజు అని వెంకటేశ్వరరావు దంపతులను నమ్మించాడు. వారిద్దరినీ తన మోటారుసైకిల్ ఎక్కించుకుని స్థానిక కమ్మిరెడ్డిపాలెం తాళ్లమ్మ రావిచెట్టు సెంటర్ వద్ద జిరాక్స్ తీసుకుని వస్తాను ఇక్కడే ఉండండి అని చెప్పి తిరిగి వారి ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఉన్న వెంకటేశ్వరరావు కుమార్తెతో మీ నాన్న ఫొటో ఇమ్మన్నాడు అని చెప్పి, మాటల్లో పెట్టి ఆమె మెడలో ఉన్న బంగారం చైను, లాకెట్, చేతికి ఉన్న ఉంగరం లాక్కుని అక్కడ నుంచి పరారయ్యాడు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, గాలింపు చర్యలు చేపట్టి తక్కువ సమయంలో బుధవారం శివకోడు గ్రామానికి చెందిన ఎల్లమిల్లి వెంకట రమణ (గాబ్రియల్ అనే కిషోర్) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని చోరీకి గురైన బంగారం వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు ఎస్సై తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాజులూరు: కుయ్యేరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ కాకినాడ ఏఈ ఎస్ ఉదయభాస్కర్ తెలిపారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పనుల్లో భాగంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్ర ఐదు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపు చేస్తున్నట్లు చెప్పారు. దుగ్గుదుర్రు, దుగ్గుదుర్రుపాటి, మేకలగరువు, కుయ్యేరు, రేగుబడవ, చింతల్లంక, ఉప్పుమిల్లి, పల్లిపాలెం తదితర గ్రామాల్లో గృహ వినియోగానికి, కుయ్యేరు పరిధిలోని దుగ్గుదుర్రు, కుయ్యేరు, పల్లిపాలెం, ఉప్పుమిల్లి ఇండస్ట్రియల్, ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాలో ఆటంకం కలుగుతుందన్నారు.

రామచంద్రపురం రూరల్: ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె. రత్నాలరావు సూచనల మేరకు మండలంలోని ద్రాక్షారామ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ మరమ్మతులు చేపడుతున్న కారణంగా నేటి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మేడిశెట్టి వెంకటరమణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పై ఫీడర్ పరిధిలోని ద్రాక్షారామ, యానాం సెంటర్, అన్నాయిపేట గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రామచంద్రపురం: కొత్తూరు సబ్‌స్టేషన్ వద్ద మరమ్మతులు చేస్తున్న కారణంగా నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రత్నాలరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తూరు, కొత్తూరు రోడ్డు, ఏపీ టిడ్కో, మాలపాడు, గొలుసు మిల్లు, చోడవరం అగ్రికల్చర్ మోటార్స్‌కు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఉచిత వైద్య శిబిరం

మండపేట: సూర్యచంద్ర ఫిషర్‌మెన్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలో ఉచిత వైద్యశిబిరం జరిగింది. బస్టాండ్ ఎదురుగా ఉన్న ఫిషర్‌మెన్ మండపంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అంబాజీపేట లేజర్, రైట్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ షైనీ, డాక్టర్ మౌనిక వైద్య సేవలు అందించారు. కంటి పరీక్షలు నిర్వహించి ఉచిత కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు. 300 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్టు సొసైటీ అధ్యక్షుడు కాటా గోపి తెలిపారు. కార్యక్రమంలో పాండ్రంకి చిన్న, సింగిడి చిన్నారావు, ఆబోతు బద్రరావు, కాటా శ్రీరాములు, జంపా తాతాజీ, కాటా బుజ్జి, పాండ్రంకి సత్తిబాబు, గుండు తాతరాజు, పాలమూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీని వేగవంతం చేయాలి



లొల్లలో ఫార్మర్ రిజిస్ట్రీని పరిశీలిస్తున్న ఏవో ప్రభాకర్

రాయవరం: మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు విశిష్ట సంఖ్య నమోదు(ఫార్మర్ రిజిస్ట్రీ)ను వేగవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ సూచించారు. మండలంలోని రాయవరం, లొల్ల, సోమేశ్వరం, నదురుబాద గ్రామాల్లో గురువారం ఆయన క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొంత భూమి కలిగి ఉన్న ప్రతి రైతు రైతు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను ఆధార్ కార్డు తరహాలో అందజేయనుందన్నారు. ప్రతి రైతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలతో పాటు పలు రాయితీలు పొందేందుకు రైతు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఈ నెల 24వ తేదీ లోగా తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు.

మొక్కలను సంరక్షిద్దాం

కొత్తపేట: స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, స్వచ్ఛాంధ్ర కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, మండల టీడీపీ అధ్యకుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. దానిలో భాగంగా ఒక్కొక్కరూ ఒక మొక్కను నాటి పరిరక్షించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ డీసీహెచ్ పాపారావు, ఐక్యూ కోఆర్డినేటర్ డాక్టర్ కె.అంకమరావు, ఫిజికల్ డైరెక్టర్ కె.కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య సంకీర్తనాచార్యుడు శ్రీనివాస్‌కు సత్కారం

కొత్తపేట: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో నిరంతరాయంగా గోవింద మాల దీక్షదారులతో స్వామివారికి వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన స్వామివారి భక్తులు (పురుషులు) ఈ నెల 4వ తేదీన (21 రోజుల దీక్ష), మహిళలు 14వ తేదీన (11 రోజుల దీక్ష) గోవిందమాల ధరించారు. మాలదారుల పూజా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం రాత్రి దశావతారాల పూజలను అన్నమాచార్య సంకీర్తనాచారి శ్రీనివాసరావు వైభవంగా నిర్వహించారు. ఆయనను గోవింద మాలాదీక్షాదారులు ఘనంగా సత్కరించారు.